2024 ఎన్నికల్లో పాలకొల్లులో సత్తాచాటుతాం

జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

పోడూరు : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పాలకొల్లులో వైసిపిని గెలిపించి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కానుకగా ఇస్తామని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది గ్రామాల గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లతో జెడ్‌పి ఛైర్మన్ ఉల్లంపర్రు ఎఎస్ఆర్ ఆడిటోరియంలో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎంఎల్‌సిగా భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా తనకు ఓటు వేసి గెలిపించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశం అనంతరం సచివాలయ, కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులు కవురు శ్రీనివాసును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, ఎంపిపి సబ్బితి సుమంగళి, మండల ఇన్‌ఛార్జి కె.గణపతిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డిటిడిసి బాబు, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

గృహ ప్రవేశం.. లేనట్టేనా..!

- ముందుకు సాగని జగనన్న ఇళ్ల నిర్మాణం
- తొలుత సంక్రాంతి, తర్వాత ఉగాది అంటూ వాయిదాలు
- మళ్లీ ఏప్రిల్ రెండో వారం అంటూ ప్రచారం
- రెండు జిల్లాల్లోనూ లక్ష్యం చేరని ఇళ్ల నిర్మాణం
- ప్రభుత్వ అరకొర సాయంపై లబ్ధిదారులు పెదవివిరుపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జగనన్న కాలనీల్లో సామూహిక గృహ ప్రవేశాలు ఉగాదికి లేనట్టేనని తేలిపోయింది. నిర్ధేశించుకున్న లక్ష్యం మేరకు గృహాల నిర్మాణం పూర్తి కాకపోవడంతో గృహప్రవేశాల కార్యక్రమం మరోసారి వాయిదా పడినట్లు తెలుస్తోంది. తొలుత సంక్రాంతికి గృహప్రవేశాలు అని ప్రకటించి మళ్లీ ఉగాదికి మార్చారు. ఇప్పుడు మరోసారి ఏప్రిల్ రెండోవారం అంటూ ప్రకటనలు చేస్తున్నారు. గృహాలు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో అధికారులకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కేవలం రూ.లక్షా 80 వేలు మాత్రమే గృహనిర్మాణాలకు అందిస్తోంది. ఈ సొమ్ము పునాదుల దశకు సైతం సరిపోవడం లేదు. అప్పు చేసి ఇళ్ల నిర్మానం చేసేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. దీంతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ముందుకు సాగని దుస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 1800 లేఅవుట్లలో 2.50 లక్షల ఇళ్లపట్టాలను ప్రభుత్వం అందించింది. తొలివిడతగా లక్షా 42 వేల ఇళ్లను నిర్మించాలని ప్రణాళిక రచించారు. జిల్లాల విభజన జరిగిన తర్వాత ఏలూరు జిల్లాలో లక్షా మూడు వేల ఇళ్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 72 వేల ఇళ్లు తొలి విడతలో నిర్మించాలని లక్ష్యం నిర్ధేశించారు. ఫిబ్రవరి నెలాఖరుకు ఏలూరు జిల్లాలో కేవలం 14 వేల ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయ్యింది. మరో 12 వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఉగాదికి గృహప్రవేశాలు చేయనున్నట్లు ప్రకటించారు. పశ్చిమలోనూ టార్గెట్‌కు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం జరగలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండటంతో ఉగాదికి చేయాల్సిన సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం మరోసారి వాయిదా పడినట్లు స్పష్టమవుతోంది. ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం ఎంత ఒత్తిడి తెచ్చినా లబ్దిదారులు ముందుకు రాకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ప్రభుత్వం అవేమీ పట్టించుకోకుండా అధికారులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తోంది.

తలలు పట్టుకుంటున్న అధికారులు

ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో అధికారులు ఇచ్చిన ప్లాన్ ప్రకారం పక్కాగా ఇల్లు నిర్మించాలంటే తక్కువగా లెక్కించినా రూ.ఎనిమిది లక్షలు వరకూ ఖర్చవుతున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. ప్రభుత్వ సాయం కేవలం రూ.లక్షా 80 వేలు మాత్రమే. అదనంగా రూ.ఆరు లక్షలు ఖర్చు చేస్తే తప్ప ఇల్లు పూర్తికాని పరిస్థితి నెలకొంది. ఇంటి స్థలం పట్టా అందుకున్న వారంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారే. స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వం అనేక వడపోతల అనంతరం ఇంటి స్థలం ఇచ్చింది. రోజు గడవడమే కష్టంగా ఉన్న కుటుంబాలు రూ.లక్షలు అప్పుతెచ్చి ఏవిధంగా ఇల్లు నిర్మించగలరో ప్రభుత్వమే చెప్పాలి. అంతేకాకుండా ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు అత్యధికచోట్ల ఊరుకు బాగా దూరంగా ఉన్నాయి. లేఅవుట్లలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు సైతం ఇంకా ఏర్పాటు కాలేదు. అలాంటి ప్రాంతాల్లో రూ.లక్షలు అప్పు తెచ్చి ఇల్లు నిర్మించేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. సిమెంట్, ఐరన్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇసుకకు సైతం పెద్దఎత్తున సొమ్ము చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇచ్చే సాయం ఇప్పుడిస్తున్న సొమ్ముకు మరో రెండు, మూడు లక్షలు పెంచితే లబ్ధిదారులు ముందుకొచ్చే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ సాయం పెంచకుండా ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావడం కష్టమని స్పష్టంగా తెలుస్తోంది. ఏప్రిల్‌లోనైనా గృహప్రవేశాలు జరుగుతాయో.. లేదోననే అనుమానం సైతం నెలకొంది. ఇంటి నిర్మాణం చేయకుంటే పట్టాలు వెనక్కి తీసుకుంటామంటూ అధికారులు బెదిరిస్తున్నప్పటికీ లబ్ధిదారులు ముందుకు రావడం లేదంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. లబ్ధిదారులను ఒప్పించలేక, ప్రభుత్వ ఒత్తిళ్లను తట్టుకోలేక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

నమూనా చెక్కును అందిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పేద విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన వరం

33,527 మంది విద్యార్థులకు రూ.25.24 కోట్లు జమ

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న విద్యాదీవెన పేద విద్యార్థులకు గొప్పవరమని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో జగనన్న విద్యా దీవెన మాన్యువల్ చెక్కును విద్యార్థుల తల్లిదండ్రులకు కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి జగనన్న విద్యాదీవెన పూర్తి ఫీజు రియంబర్స్ మెంటు కింద అక్టోబరు, డిసెంబరు 2022 త్రైమాసికానికి 35,527 మంది విద్యార్థులకు రూ.25.44 కోట్లు 29,891 మంది తల్లుల ఖాతాలకు జమచేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎస్‌సి వెల్ఫేర్‌కు సంబంధించి 5,507 మంది విద్యార్థులకు రూ.5.53 కోట్లు, బిసి వెల్ఫేర్‌కు సంబంధించి 15,542 మంది విద్యార్థులకు రూ.10.29 కోట్లు, ఇబిసి వెల్ఫేర్‌కు సంబంధించి 3,240 విద్యార్థులకు రూ.2.70 కోట్లు, కాపు వెల్ఫేర్‌కు సంబంధించి 8,069 మంది విద్యార్థులకు రూ.5.90 కోట్లు, ట్రైబల్ వెల్ఫేర్‌కు సంబంధించి 67 మంది విద్యార్థులకు రూ.83 లక్షలు, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్‌కు సంబంధించి 352 మంది విద్యార్థులకు రూ.31 లక్షలు, క్రిష్టియన్ వెల్ఫేర్‌కు సంబంధించి 659 మంది విద్యార్థుల రూ. 41 లక్షలు కలిపి మొత్తం 33,527 మంది విద్యార్థులకు గాను 29,891 మంది తల్లుల ఖాతాలకు రూ.25.24 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసి రాజు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జివిఆర్‌కెఎస్ఎస్.గణపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ఎస్‌టి సంక్షేమ అధికారి డి.పుష్పరాణి పాల్గొన్నారు.

నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరు

ప్రజాశక్తి - వీరవాసరం

సమస్యలను పరిష్కరించాలని అడుగుతుంటే నోటీసులిచ్చి గృహ నిర్బంధాలు చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉసిగొల్పడాన్ని రైతు సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జుత్తిగ నరసింహమూర్తి ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్నట్టుగా ఎపిలో జీతాలు ఇస్తూ పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఈ నెల 20న అంగన్‌వాడీ, మిడ్డేమీల్స్ రాష్ట్ర సంఘాలు చలో విజయవాడ నిర్వహించకుండా ముందస్తుగా సిఐటియు, రైతు, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, అంగన్‌వాడీ నాయకులకు నోటీసులివ్వడం పట్ల నరసింహమూర్తి తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఉదయం తనకు, ప్రజా సంఘాల నాయకులకు నోటీలిచ్చారని తెలిపారు. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే సుప్రీం కోర్టు ఆదేశాలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని తెలిపారు.

ప్రతాప్‌కు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

తణుకురూరల్ : ప్రజల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్లే చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ అన్నారు. ఈ నెల 20న జరిగే చలో విజయవాడను ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ఆందోళనకారులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య వ్యతిరేకమని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం అరెస్టులు, నిర్బంధాలు వంటివి మానుకొని ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన పనిచేస్తున్న వారి ఇంటికి వెళ్లి అర్ధరాత్రి సమయంలో మహిళలు అని చూడకుండా నోటీసులివ్వడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ఇటువంటి చర్యలను సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రభుత్వం ఇలాంటి పద్ధతులు విడనాడక పోతే తగిన గుణపాఠం తప్పదన్నారు. అరెస్టు చేసిన అడ్డగర్ల అజయకుమారి, ఇతరులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పెంటపాడు : నేతల నిర్బంధకాండను వ్యతిరేకిస్తూ స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ఆదివారం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 20న చలో విజయవాడకు వెళ్లనున్న నేపథ్యంలో నేతలను పోలీస్ స్టేషన్‌కు పిలిచి నోటీసులివ్వడం సరికాదని తెలిపారు. ఇది చాలా దురదృష్టకరమైన చర్య అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.మూడు వేల పారితోషికం ఇస్తున్నారని, నిత్యాసర వస్తువుల ధరలు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని చాలీ చాలని జీతాలతో వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వారి సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న చలో విజయవాడను ఆపేందుకు ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ప్రయోగించడం సరికాదన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గ పాల్గొన్నారు.

అజయకుమారికి నోటీసులు అందజేస్తున్న పోలీసులు

మళ్లీ అదే నిర్లక్ష్యం.. అదే ముంపు

- తాత్కాలిక పనులతో సరి.. కానరాని శాశ్వత పరిష్కారం
- పొలమూరు జగనన్న లేఅవుట్‌లోకి మరోసారి నీళ్లు
- స్పందించని జిల్లా అధికారులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

అకాల వర్షాల ప్రభావంతో పొలమూరు సచివాలయం వెనుకనున్న జగనన్న లేఅవుట్ మరోసారి నీట మునిగింది. పై నుంచి వర్షపు నీరు, పక్కనుంచి పొలాల్లోని సాగునీరు లేఅవుట్‌లోకి ప్రవేశించడంతో అక్కడ అడుగు పెట్టలేని దుస్థితి ఏర్పడిందని లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇప్పటికే అక్కడ ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్నవారైతే రోజువారీ అవసరాలకు ఎలా వెళ్లాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

లేఅవుట్‌లోకి చేరిన నీటిని చూపుతున్న లబ్ధిదారుని భర్త

గతంలోనే ఈ లేవుట్ దుస్థితిని 'లేఅవుట్‌లోకి నీళ్లు.. లబ్ధిదారులకు కన్నీళ్లు' శీర్షికన ప్రజాశక్తి కథనాన్ని ప్రచురించింది. నాడు మండల, గ్రామస్థాయి అధికారులు స్పందించి పొలాల్లో నీరు లేఅవుట్‌లోకి రాకుండా తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. అయితే తాత్కాలికమే కావడం, లేఅవుట్ పల్లంగానే ఉండటంతో ఆ ప్రాంతంలోకి నీటి ఊట చేరుతూనే ఉంది. తాజాగా వర్షాలకు లేఅవుట్‌లోకి నీరు చేరగా.. 'గోరుచుట్టుపై రోకలి పోటు' చందంగా పక్కనే ఉన్న పొలాల్లోని నీరు లేఅవుట్‌ను ముంచెత్తింది. కొద్దిరోజుల క్రితమే ఆ ప్రాంతంలో సుమారు నలుగురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుత పరిస్థితితో ఇళ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడింది. మెటీరియల్ లోపలికి తీసుకెళ్లే అవకాశం లేకపోవడంతో సచివాలయం వద్ద భవన నిర్మాణ మెటీరియల్ దిగుమతి చేసుకుని అక్కడ నుంచి కూలీలచే మోయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఒక్కో లబ్ధిదారునికి సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకూ అదనంగా ఖర్చుయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంతోపాటు రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలు త్వరితగతిన ఏర్పాటు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జిని వివరణ కోరగా వెంటనే సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి ఎస్.మోహన్‌రావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ నరసింహను ఆదేశించానని తెలిపారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - భీమవరం

భవిష్యత్తులో ఉద్యోగ, కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఆరు మున్సిపాల్టీల్లో పని చేస్తున్న కార్మికులను, ఉద్యోగులను ఐక్యం చేసి సమస్యలపై రానున్న కాలంలో విస్తృత పోరాటాలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆ సంఘం జిల్లా విస్తృత సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో ఫెడరేషన్ నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఆ కమిటీ వివరాలను కె.రాజా రామ్మోహన్‌రాయ్ వెల్లడించారు. జిల్లా అధ్యక్షులుగా కర్రి నాగేశ్వరరావు, కార్యదర్శిగా ధనాల వెంకట్రావుతోపాటు దానయ్య, నీలాపు రాజు, ఆదినారాయణ బాబుతోపాటు పాటు మరో 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కనీస వేతనాల అమలు, పిఎఫ్, ఇఎస్ఐ, యూనిఫారం, ఇతర సౌకర్యాల సాధనకు రాబోయే కాలంలో ఆందోళనలు చేయనున్నామన్నారు. ప్రతి మున్సిపాల్టీలోనూ వర్కర్స్ తక్కువ పని ఎక్కువ కన్పిస్తుందని, వర్కర్స్‌ను పెంచాల్సిన అవసరం ప్రభుత్వం మీద ఉందని అన్నారు. పారిశుధ్య కార్మికులు వాటర్, ఎలక్ట్రికల్ వంటి ఇతర సిబ్బంది చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కర్రి నాగేశ్వరరావు



ధనాల వెంకట్రావు

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయ్

నంబూద్రిపాద్, మల్లు స్వరాజ్యంను ఆదర్శంగా తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం తొలితరం నాయకులు ఇఎంఎస్ నంబూద్రి పాద్, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యంను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం అన్నారు. భీమవరం మెంటేవారితోటలోని సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద ప్రజా నాట్యమండలి గీతాలాపనలతో ఇరువురి ప్రథమ వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఇఎంఎస్ నంబూద్రిపాద్ భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన పాత్ర పోషించారన్నారు. 1957లో భారత దేశంలో మొట్ట మొదటిసారిగా ప్రజాస్వామ్యయుతంగా ఓట్ల ద్వారా గెలుపొందిన తొలి ముఖ్యమంత్రి ఇంఎస్.నంబూద్రిపాద్ అన్నారు. మల్లు స్వరాజ్యం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, తెలంగాణ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరు, ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో మహిళా ఉద్యమాన్ని నిర్మించారని తెలిపారు. వందలాది పల్లెలు, శ్రామికులు, కూలీల విముక్తి కోసం తుపాకీ పట్టి పోరాడిన యోధురాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్, బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, ఎం.వైకుంఠరావు, కార్యకర్తలు మల్లిపూడి ఆంజనేయులు, ఎస్‌కె.వలీ, బిఎన్ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

తణుకురూరల్ : దోపిడి లేని సమాజం కోసం జీవితాంతం ఇఎంఎస్ నంబూద్రిపాద్, మల్లు స్వరాజ్యం కృషి చేశారని సిపిఎం జిల్లా నాయకులు జివిఎల్ నర్సింహారావు, పివి ప్రతాప్ అన్నారు. స్థానిక అమరవీరుల భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో నంబూద్రిపాద్ 25వ వర్ధంతి, మల్లు స్వరాజ్యం మొదటి వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో ముందుకు సాగిన వ్యక్తులు నంబూద్రిపాద్, మల్లు స్వరాజ్యం అన్నారు. పేదల ప్రభుత్వాన్ని తీసుకురావడానికి వీరు వారి జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ధనలక్ష్మి పాల్గొన్నారు.

భీమవరం : నంబూద్రిపాద్, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నేతలు

ఆచంట : భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో ఇఎంఎస్ నంబూద్రిపాద్, మల్లు స్వరాజ్యం ధృవతారల్లాంటివారని సిపిఎం మండల కమిటీ సభ్యులు వర్ధిపర్తి అంజిబాబు అన్నారు. భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, కేరళ మాజీ ముఖ్యమంత్రి నంబూద్రిపాద్, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. తొలుత సిపియం సీనియర్ నాయకులు ఇందుకూరి సూర్యనారాయణ రాజు, తోటపల్లి సత్యన్నారాయణ నంబూద్రిపాద్, మల్లు స్వరాజ్యం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ సాంప్రదాయ, భూస్వామ్య కుటుంబాల్లో పుట్టిన ఈ మహనీయులు కార్మిక, శ్రామిక వర్గ లక్ష్యాలకు అంకితమై పీడిత ప్రజల హక్కులకై తమ జీవిత చరమాంకం వరకూ పోరాడారని తెలిపారు. ఈ మహనీయులు చూపిన పోరాట మార్గంలో పయనించి, వారి ఆశయాలను నెరవేర్చడమే వారికిచ్చే ఘననివాళి అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు ఎస్‌విఎన్.సిర్రా నర్సింహమూర్తి, బొర్రా ధర్మారావు, సత్యన్నారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

హస్త కళలను ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

హస్తకళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. భీమవరంలోని శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి ఆలయ వద్ద ఉన్న ఐఎంఎ హాల్లో ఏర్పాటు చేసిన హస్తకళల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ ఆదివారం తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హస్తకళల ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలన్నారు. నిత్యం వినియోగించే అనేక వస్తువులు, లేస్‌తో తయారు చేసిన వివిధ రకాల వస్తువులు ప్రదర్శనలో ఉంచినట్లు తెలిపారు. వీటిని ప్రజలు కొనుగోలు చేసి వినియోగించుకోవాలన్నారు. హస్త కళలను ప్రోత్సహించేందుకు వారికి శిక్షణ ఇవ్వడం, బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టరు ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ దాసి రాజు, డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

పాలకొల్లులో భారీ వర్షం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం పడింది. దీంతో పట్టణంలోని రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు రెండు రోజుల అకాల వర్షాలతో ఛిద్రంగా మారాయి. దీనికితోడు చలిగాలులు వీస్తుండడంతో జనం వణికిపోతున్నారు. అయితే మధ్యాహ్నం నుంచి కాసింది.

పాలకొల్లులో భారీ వర్షంతో నీట మునిగిన పిపి రోడ్డు

మొగల్తూరు : ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు చిత్తడిగా మారాయి. ఆదివారం తెల్లవారుజామున మండలంలో భారీ వర్షం కురిసింది. అకాల వర్షంతో ఇటుక వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. ఆక్వా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కోసం 24 గంటలు ఏరియేటర్లో వినియోగిస్తున్నారు.

25న దెందులూరు రానున్న సిఎం జగన్

వైఎస్ఆర్ ఆసరా 3వ విడత పథకం ప్రారంభం

దెందులూరు: ఈ నెల 25న వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమాన్ని ప్రారంభించడానికి మండల కేంద్రమైన దెందులూరుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ టి.రఘురాంతో కలిసి కలెక్టర్ ప్రసన్నకుమార్, ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ, ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి సభా స్థలి కోసం పరిశీలన చేశారు. దెందులూరు హైవేను ఆనుకుని టిటిడి కళ్యాణ మండపం పక్కనే ఉన్న స్థలాన్ని పరిశీలించి బహిరంగ సభకు ఎంపిక చేశారు. దెందులూరు హైస్కూల్లో హెలీప్యాడ్ ఏర్పాటుకు నిర్ణయించారు. అయితే సిఎం పర్యటన షెడ్యూల్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

సిఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. ఆదివారం గంగన్నగూడెంలోని శ్రీకృష్ణ కన్వెన్షన్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, మండల అధికారులతో కలెక్టర్, ఎంఎల్ఎ అబ్బాయిచౌదరి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఈ నెల 25న సిఎం జగన్ దెందులూరులో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత పథకాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

అంజా సీతాదేవి, గవర్నమెంట్ పోస్ట్ బేసిక్ స్కూల్ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం, పెంటపాడు

విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్నాం. తమ స్కూల్ నుంచి పదో తరగతి విద్యార్థులు సుమారు 127 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. గత సంవత్సరం తమ స్కూల్ మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. ఉదయం సాయంత్రం కూడా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేశాం. పిల్లలకు సెల్ ఫోన్ ఇవ్వొద్దని, టీవీలు చూడటం గాని చేయకుండా చూడాలని తెలిపాం. ఈ విద్యా సంవత్సరం మా స్కూల్ జిల్లాలోనే మొదటి స్థానంలో నిలుస్తుందని ఆశిస్తున్నాం. మా స్కూలు క్రమశిక్షణకు పేరు గాంచింది. నూరుశాతం ఉత్తీర్ణతకు ఎనలేని కృషి చేస్తున్నాం.

అమరావతిలో మోషేనురాజును కలిసిన ఎస్‌సి నాయకులు

మోషేనురాజును కలిసిన ఎస్‌సి నేతలు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం మండలానికి చెందిన పలువురు వైసిపి ఎస్‌సి నాయకులు శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును అమరావతిలో ఆయన ఛాంబర్లో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో వైసిపి విజయానికి ఎస్‌సిల పాత్ర, మండలంలో జరుగుతున్న అభివృద్ధి వంటి విషయాల పట్ల ప్రస్తావించినట్లు ఎస్‌సి నాయకులు తెలిపారు. మోషేన్‌రాజును కలిసిన వారిలో వీరవాసరం సర్పంచి చికిలే మంగతాయారు, ఎస్‌సి నాయకులు నేతల జ్ఞానసుందరాజు, కాటం స్టాన్లీరాజు, చిక్కాల రాజు, పి.బుల్‌రాజు, శ్యాంబాబు, గెడ్డం భాస్కరరావు, బొంతు రమేష్, పత్తుల సాల్మన్‌రాజు పాల్గొన్నారు.

21న ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వీరవాసరం

ఈ నెల 21న భీమవరం కలెక్టరేట్ వద్ద ఆశా వర్కర్ల సమస్యలపై నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం ఆశా వర్కర్ల సమావేశం యూనియన్ అధ్యక్షురాలు డి.వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ప్రమోషన్లలో అవకాశం కల్పించాలని, రికార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బేబి, నిర్మల, సుబ్బలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

మట్టకోడు వంతెనను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

మట్టకోడు వంతెనను పున:నిర్మించాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

శిథిలావస్థలో ఉన్న మట్టకోడు వంతెన పున:నిర్మాణం చేసి ప్రమాదాలను నివారించాలని సిపిఎం గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తణుకు మండలం వేల్పూరు రైల్వేస్టేషన్ సమీపంలో శిథిలావస్థలో ఉన్న మట్టకోడు వంతెనను సిపిఎం గ్రామ కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ వేల్పూరు నుండి మండపాక, గుమ్మంపాడు, ఎర్రనీలిగుంట, వరిఘేడు గ్రామాల ప్రజలకు దగ్గర మార్గం కావడం వల్ల ఎక్కువ మంది వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నారన్నారు. పారిశ్రామిక ప్రాంతం కావడం వల్ల పరిశ్రమలకు భారీ లోడుతో ఊక లారీలు ఈ వంతెన గుండా రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు, రైతులు, ఉద్యోగులు ఈ వంతెనపై నుండి భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఈ వంతెనకు రెయిలింగ్ లేకపోవడంతో గతంలో రూ.2 లక్షలు విలువ చేసే గేదె అదుపు తప్పి కాలువలో పడి చనిపోయిందని తెలిపారు. ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణం స్పందించి శిథిలావస్థలో ఉన్న వంతెనను పున:నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, రుద్రాక్షుల శ్రీను, వాసా పోషియ్య, కరెళ్ల రాంబాబు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్య నిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

'ఒబిసి సర్టిఫికెట్లు రద్దు చేసింది టిడిపినే'

ప్రజాశక్తి - పాలకొల్లు

తూర్పు కాపులకు ఒబిసి సర్టిఫికెట్లు ఇచ్చే ప్రక్రియను 2017లో టిడిపి ప్రభుత్వం రద్దు చేసిందని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చెప్పారు. ఆదివారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత నాలుగు సంవత్సరాల వైసిపి పాలనలో తూర్పు కాపులకు ఒబిసి సర్టిఫికెట్లు సిఎం జగన్ ఇవ్వడం లేదని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు అసెంబ్లీ వద్ద ఆరోపించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. కేవలం గ్లోబల్ ప్రచారం కోసమే రామానాయుడు డ్రామాలు ఆడుతున్నారన్నారు. టిడిపి హయంలో టిడ్కో లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చినప్పుడు మహిళలు బ్యాంకుల వాయిదాలు కట్టుకోవాలని ఎంఎల్‌ఎ జారీ చేసిన పత్రాల్లో ఉన్నాయని చెప్పారు. జగన్ హామీ ఇచ్చిన విధంగా రూ.లక్ష కట్టేవారికి రూ.50 వేలు, రూ.50 వేలు కట్టేవారికి రూ.25 వేలకు రుణభారం తగ్గించారన్నారు. దీనిపై బహిరంగ చర్చకు ఎంఎల్‌ఎ సిద్ధం కావాలని ఆయన సవాలు విసిరారు. టిడిపి టిడ్కో గృహాలకు రూ.250 కోట్లు బకాయిలు పెడితే జగన్ ప్రభుత్వం పేదల కోసం తీర్చిందని చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి నేతలు జోగాడ ఉమామహేశ్వరరావు, జోగి వడ్డికాసులు, రేలంగి శ్రీను, కాపిశెట్టి శ్రీనివాస్, పిల్లా శ్రీనివాస్, పెచ్చెట్టి కృష్ణాజి, చిట్టిబాబు పాల్గొన్నారు.

నేడు చలో అసెంబ్లీ : సిపిఐ

ప్రజాశక్తి - పెంటపాడు

సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఈ నెల 20వ తేదీన నిర్వహించే చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కలింగ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా కమ్యూనిస్టు నాయకులు లక్ష్మీనారాయణను, వంక అప్పారావును పోలీసులు ముందస్తు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కలింగ లక్ష్మణరావు మాట్లాడుతూ అరెస్టులు చేయడం సరికాదన్నారు. అప్రజాస్వామిక చీకటి జిఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గూడెంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం : శిబిరాన్ని ప్రారంభిస్తున్న సిఐ నాగరాజు

తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జనతా హాస్పిటల్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పట్టణ సిఐ ఎస్ఎస్‌వి.నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ నాగరాజు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం వారు ప్రతి నెలా మూడో ఆదివారం ఉచిత నేత్ర శిబిరాన్ని ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్ చేయించడం ద్వారా పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలందరూ వినియోగించుకుని కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎస్‌వి నాగేశ్వరరావు, మదన్మోహన్ అగర్వాల్, పేరూరి కాశయ్య, పచ్చ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు వాకర్స్ క్లబ్, కిమ్స్, బొల్లినేని ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో గుండె, మూత్రకోశ, కిడ్నీ సంబంధిత వ్యాధులకు వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. పలువురికి మందుల పంపిణీ చేశారు. శిబిరం నిర్వహణకు వాకర్స్ క్లబ్ అధ్యక్షులు గవర్నర్ రామకృష్ణ, అధ్యక్షులు తటవర్తి సుధాకర్, కార్యదర్శి పీర్ సాహెబ్, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, కొమ్ముల మురళీకృష్ణ, మేడికొండ రామదాసు సహకరించారు. యునైటెడ్ కాపు క్లబ్ గవర్నర్ ముచ్చర్ల సంజయ్, కాగిత సూర్యనారాయణ పాల్గొన్నారు.

డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారం

డ్రెయినేజీ అస్తవ్యస్తం..!

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

పూలపల్లి గ్రామంలో యాక్సిస్ బ్యాంక్ ఎదురుగా ఉన్న డ్రెయిన్ అధ్వానంగా తయారైంది. పూర్తిగా చెత్తా చెదారాలతో నిండిపోయి మురుగు ప్రవహించక దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు దోమలు విపరీతంగా పెరిగి సమస్యగా మారాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు డ్రెయిన్లలో వేయడం వల్ల అవి పూడుకుపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

తెన్నేటి మాస్టారుకు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - పాలకోడేరు



అవార్డు అందుకుంటున్న తెన్నేటి మాస్టారు

పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తెన్నేటి మాస్టార్‌కు ఉగాది జాతీయ సాహిత్య పురస్కారం లభించింది. ఉగాదిని పురస్కరించుకుని బెంగళూరుకు చెందిన తెలుగు రచయితల సమైక్య ఆధ్వర్యంలో బెంగళూరు కళ్యాణ్‌నగర్‌లోని ఇండోనేషియన్ అకాడమీలో ఆదివారం పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ సిబిఐ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణ తెన్నేటి మాస్టారుకు పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. గణపవరం శ్రీ పద్మినీ పుర కళాపీఠం ఆధ్వర్యంలో తెన్నేటి మాస్టారు రాసిన తేనెలూరు తెలుగు మనది అనే వ్యాస సంకలనానికి ఈ పురస్కారం లభించినట్లు సమాఖ్య ఛైర్మన్ మాల్యాద్రి బొగ్గవరపు, అధ్యక్షుడు జి.చండీశ్వర్, ప్రధాన కార్యదర్శి కళ్లే వెంకటేశ్వర శాస్త్రి తెలిపారు. ఈ సందర్భంగా తెన్నేటి మాస్టారు మాట్లాడుతూ తెలుగేతర రాష్ట్రంలో తెలుగు భాష, సాహిత్యాన్ని పెంచి పోషించడమనేది అభినందనీయమని చెప్పారు. శ్రీ పద్మినీ పుర కళాపీఠం గౌరవాధ్యక్షులు ఆర్‌విఎస్.రాజు, గోదావరి సాహితీ ప్రభ కార్యదర్శి చిర్రావూరి లక్ష్మీనారాయణ, ఏలూరు శర్వాణీ విద్యా సంస్థల అధినేత లక్ష్మణకుమార్, యండపల్లి పాండురంగ కవి, పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.మహేష్‌బాబు, ఉపాధ్యాయులు తెన్నేటి మాస్టర్‌ను అభినందించారు.

అకాల వర్షం.. రైతుల ఆందోళన

ప్రజాశక్తి - ఆచంట

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు తదితర గ్రామాల్లో పంట పొలాలు పొట్ట, ఈనె దశలో ఉన్నాయి. దీంతో పంట పొలాలు ఎక్కడ దెబ్బ తింటాయో అని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే ఎకరానికి రూ.18 వేల వరకూ ఖర్చు చేసినట్లు రైతులు చెబుతున్నారు. వర్షాల కారణంగా పంట పొలాలకు అగ్గి తెగుళ్ల ఆశిస్తాయని వాపోతున్నారు. తక్షణం అధికారులు సూచనలు, సలహాలు ఇవ్వాలని మండల రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పెనుమంట్ర:అకాల వర్షాలకు వివిధ పంటలు దెబ్బ తినడమే కాకుండా, ఈ ప్రభావం రహదారులపై కూడా పడింది. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందుపడ్డారు. ముఖ్యంగా పొలమూరు నుంచి నౌడూరు సెంటర్ వెళ్లే ప్రధాన రహదారికి అధికారులు ఎన్నిసార్లు మరమ్మతులు చేసినప్పటికీ కొత్తగా రోడ్డు నిర్మాణానికి మాత్రం నోచుకోవడం లేదు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వాహనాలు కోరుతున్నారు.

చిరస్మరణీయులు కాటయ్య

ప్రజాశక్తి - యలమంచిలి

మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు

సిపిఎం సీనియర్ నాయకులు కలగంపూడి గ్రామానికి చెందిన మల్లుల కాటయ్య చిరస్మరణీయుడని పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు అన్నారు. ఆదివారం కలగంపూడి గ్రామంలో కాటయ్య సంతాప సభ సీనియర్ నాయకులు గుబ్బల చక్రపాణి అధ్యక్షతన జరిగింది. సభలో బాలరాజు మాట్లాడుతూ కాటయ్య 1970 - 80 మధ్యకాలంలో కలగంపూడి గ్రామాల్లో భూస్వాములకు, పేదలకు మధ్య జరిగిన మహా పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. పార్టీ ఏ కార్యక్రమం చేపట్టినా అందరికంటే ముందుగా పాల్గొనేవారిని గుర్తు చేశారు. అదేవిధంగా స్థానిక సమస్యలపై ఎప్పుడూ ముందుండి ఆయన పని చేసే వారన్నారు. పార్టీలో పనిచేయడానికి ఆయన భార్య వెంకాయమ్మ ఎంతగానో ప్రోత్సహించే వారిన్నారు. అటువంటి దంపతులను ఇప్పటితరం ఆదర్శంగా తీసుకొని పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలగంపూడి మాజీ సర్పంచి పొత్తూరు జ్యోతి, జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి, స్థానిక నాయకులు మాసవరపు సుబ్బారావు, గూడూరి ఆంజనేయులు, గుబ్బల సత్యనారాయణ, మందులు, కుమార్, కాటయ్య మనవరాలు ఉదయభాను పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కాళ్ల

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం కాళ్ల శివాలయంలో సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండా సూరిబాబు అధ్యక్షతన ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, ప్రభుత్వం రైతు కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, మతం పేరుతో ప్రజలను విడగొట్టి పరిపాలిస్తుందని విమర్శించారు. దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులను యజమానులకు బానిసలను చేసి ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్పులు చేసి లేబర్ కోడ్‌లు పార్లమెంట్‌లో పాస్ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చి రైతులకు ద్రోహం చేసే చర్యలను రైతులు వీరోచిత పోరాటంతో అడ్డుకున్నారన్నారు. ఏప్రిల్ ఐదో తేదీన చలో ఢిల్లీకి పెద్ద ఎత్తున వ్యవసాయ కార్మికులు, రైతులు తరలివచ్చి కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఢిల్లీకి కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు రజిని, ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘం జిల్లా సెక్రటరీ గంటా భవాని, ఏడుకొండలు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం వెంప, పెదగరువు, దుర్సుమారు గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదాని, అంబాని వంటి పెట్టు బడిదారులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ము కాస్తుందన్నారు. ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై పోరాడి ప్రజా అనుకూల విధానాల అమలు కోసం ఏప్రిల్ ఐదో తేదీన ఢిల్లీలో జరిగే కార్మిక కర్షక ప్రదర్శన జయప్రద చేయాలని పిలుపునిచ్చారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 128 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో వివిధ కళాశాలలకు చెందిన 253 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 128 మంది ఐసిఐసిఐ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకులకు ఉద్యోగాల కోసం ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.25 వేలు జీతంగా చెల్లిస్తారని ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటర్వ్యూలను ఐసిఐసిఐ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు తరపున ఎస్.మాధవ్‌వర్మ, పవన్‌కుమార్ నిర్వహించగా, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.లక్ష్మణ్‌రావు సంధానకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహరావు మాట్లాడుతూ జిల్లాలో యువతకు ఉద్యోగ అవకాశాల కల్పించే ఉద్దేశంతో తమ కళాశాల ప్రాంగణంలో ఇటువంటి డ్రైవ్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు మాట్లాడుతూ విద్యార్థులు నిబద్ధత, క్రమశిక్షణ, నైపుణ్యాలు కలిగి ఉంటే ఉద్యోగం సాధించడం సులభతరమన్నారు. ప్రాంగణ ఎంపిక చేసేందుకు విచ్చేసిన హెచ్‌ఆర్ ప్రతినిధి పవన్ మాట్లాడుతూ పర్సనల్ ఇంటర్వ్యూ, ఆప్టిట్యూడ్ టెస్ట్, టెక్నికల్ స్కిల్స్‌లో నైపుణ్యాన్ని నిరూపించుకోగలిగితే ఎంపిక చేసుకోవటంలో సులభతరం అవుతుందని చెప్పారు.

సిఎం జగన్‌ను కలిసిన డిటిడిసి బాబు

ప్రజాశక్తి - పోడూరు

సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని జిన్నూరు సొసైటీ ఛైర్మన్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి డిటిడిసి బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ఎంఎల్‌సిగా భారీ మెజార్టీతో గెలుపొందడం పట్ల అభినందనలు తెలుపుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల నిర్వహణకు కవురు శ్రీనివాస్ చేస్తున్న కృషిని డిటిడిసి బాబు సిఎంకు వివరించారు. ఆయనతో పాటు ఉపసర్పంచి దండు వెంకట గోపాల కృష్ణంరాజు, ఎఎంసి డైరెక్టర్ జమ్ము మృత్యుంజయరావు, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు భూపతిరాజు సూర్పరాజు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి

ప్రజాశక్తి - భీమవరం రూరల్



పరీక్ష సామగ్రితో విద్యార్థులు

పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంతో పరీక్షలకు సిద్ధం కావాలని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ప్రభుత్వ బిసి బాలికల హాస్టల్ వార్డెన్ కుసుమ కుమారి అన్నారు. ఆదివారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ బిసి హాస్టల్లో పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్ష సామగ్రి అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ కుసుమ కుమారి మాట్లాడుతూ విద్యార్థులు సాధించాల్సిన ప్రగతి గురించి ఆలోచిస్తూ పరీక్షలు రాయాలన్నారు. హాస్టల్లో ఉండే విద్యార్థులెందరో ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు సాధించారన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అరగంట ముందే పరీక్ష హాలుకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో అరసవల్లి ట్రస్ట్ ఛైర్మన్ అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఎండి సరోజినీ, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎస్‌సి వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపాలి'

ప్రజాశక్తి - పాలకొల్లు

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపేందుకు ఒత్తిడి చేసే క్రమంలో భాగంగా ఈ నెల 20న మందా కృష్ణ మాదిగ ఏలూరు విచ్చేస్తున్నారని గోదావరి జిల్లాల ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ పసుపులేటి చినబాబు తెలిపారు. యార్లగడ్డ రత్నరాజు అధ్యక్షతన బెత్లహంపేటలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న మాదిగ ఉద్యోగస్తులతో, 28న మహాజన సోషలిస్టు పార్టీ నాయకత్వంలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 3న మందా కృష్ణ మాదిగ నాయకత్వంలో వేలాది మంది మాదిగలతో విజయవాడ, హైదరాబాద్ నగరాల్లోని బిజెపి కార్యాలయాల ముట్టడి, 4న నగరాల దిగ్బంధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు నామవరపు కృపానాదం, ఈతకోట మోసేను, శ్రీనివాస్, యార్లగడ్డ సాగర్, రవితేజ, రాఘవ, ప్రవీణ్, మహేష్, మాదాసు రవితేజ పాల్గొన్నారు.

22న వీర పేరంటాలు అమ్మవారి వార్షికోత్సవం

ఉండి :ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వెలివర్రు గ్రామదేవత వీర పేరంటాలు అమ్మవారి 70వ వార్షికోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ మంతెన రంగరాజు తెలిపారు. ఆదివారం ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి రుద్రరాజు ఫణి రామకిశోర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ మంతెన రంగరాజు మాట్లాడుతూ వీర పేరంటాలు అమ్మవారి 70వ వార్షిక మహోత్సవాలకు చలువ పందిళ్లు వేసి, తాగునీరు, చల్లటి మజ్జిగ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని ప్రజలే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముదునూరి కొండరాజు, కల్లేపల్లి సతీష్ రాజు, రుద్రరాజు సంజీవరాజు, గొట్టుముక్కల జానకిరామరాజు, ముదునూరి వీర్రాజు పాల్గొన్నారు.

'టిడిపి విజయంపై సంబరాలు'

ప్రజాశక్తి - మొగల్తూరు

భవిష్యత్తులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు అన్నారు. ఎంఎల్‌సి పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం పట్ల మొగల్తూరులోని ఆ పార్టీ నాయకులు ఆదివారం సంబరాలు చేశారు. ఈ సందర్భంగా మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్లో బాణాసంచా కాల్చి ప్రజలకు మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో కలిదిండి కుమార్ బాబు, పంపండి శ్రీకృష్ణ భగవాన్, బొల్లా చంటి, కొల్లాటి భోగరాజు, పాల రాంబాబు పాల్గొన్నారు.

పాలకోడేరు :ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపి ఎన్ని ప్రలోభాలకు గురి చేసినా టిడిపికే పట్టం కట్టడాన్ని బట్టి చూస్తే రానున్న ఎన్నికల్లో పార్టీ కోసం ప్రజలు ఎలా ఎదురుచూస్తున్నారో అర్థమవుతుందని టిడిపి మండల అధ్యక్షుడు దెందుకూరి టాగూర్ కోటేశ్వరరాజు, టిడిపి యూనిట్ అధ్యక్షులు కమ్మిలి రాంబాబు అన్నారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో మూడు చోట్ల విజయం సాధించడంతో హర్షం వ్యక్తం చేస్తూ గొల్లలకోడేరులో గ్రామ టిడిపి అధ్యక్షుడు కాజా వీరాస్వామి, టిడిపి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు కోటిరాజు, కమ్మిలి రాంబాబు, ఖాజా వీరస్వామి మాట్లాడుతూ వైసిపి పార్టీతో ప్రజలు విసుగు చెందారన్నారు. సాల మల్లేశ్వరరావు, కొండపల్లి ఏసురత్నం, జుత్తిక శ్రీను, తంగిళ్ల శ్రీను, రౌతు సత్యనారాయణ, గాదిరాజు బోసు, బాపిరాజు పాల్గొన్నారు.

రైళ్లను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - వీరవాసరం

నరసాపురం నుంచి రాజమండ్రి వెళ్లే రైళ్లను పునరుద్ధరించాలని రైల్వే పాసింజర్స్ అసోసియేషన్ రైల్వే అధికారులను కోరింది. ఈ మేరకు రైల్వే అధికారులకు లేఖ రాసినట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ సబ్బారాపు వెంకట్రావు ఆదివారం తెలిపారు. కోవిడ్‌కు ముందు కొనసాగిన ఈ రైళ్ల కోవిడ్ కాలంలో రద్దు చేసి కోవిడ్ తగ్గిన తరువాత పునరుద్ధరించలేదని లేఖలో పేర్కొన్నారు. రాజమండ్రి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు ప్రధాన పట్టణంగా ఉంది. రాజమండ్రి పట్టణంలో ఉన్న ఎయిర్‌పోర్టు కోస్తా ప్రాంతాలకు వారికి అనువుగా ఉండటం వల్ల ఈ రైలు మార్గం ద్వారా ప్రయాణం చేస్తూ ఉంటారు. విద్య, వాణిజ్య పరంగా రాజమండ్రి అనువుగా ఉండటం వల్ల ఈ ప్రాంత వాసులు రైళ్ల ద్వారానే రాకపోకలు సాగిస్తూ ఉంటారు. నరసాపురం నుంచి భీమవరం, తణుకు, నిడదవోలు వంటి ప్రాంతాల నుంచి విద్యార్థులు, వ్యాపారులు, వైద్యం కోసం ప్రతిరోజు అనేక మంది ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న నరసాపురం-రాజమండ్రి రైళ్లను పునరుద్ధరించాలని కోరినట్లు రైల్వే అసోసియేషన్ ప్రెసిడెంట్ సబ్బారాపు వెంకట్రావు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

22 నుంచి ముఖదారమ్మ జాతర

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 22వ తేదీ ఉగాది నుంచి 28వ తేదీ వరకు పాలకొల్లు అచ్చుగట్లపాలెంలో ఉన్న ముఖధారమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మండెల రజని తెలిపారు. 22వ తేదీ ఉగాది రోజున పుట్టింటి వారి జాతర, 23న కమిటీ వారిచే అమ్మవారి జాతర వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి కమిటీ సభ్యులు ఆదివారం పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ కుంపట్ల రాజా, ట్రెజరర్ చెక్కా కృష్ణ, గౌరవ అధ్యక్షులు చినిమిల్లి గణపతిరావు, ఆలయ పెద్దలు కొల్లంశెట్టి నాగేశ్వరరావు, రేలంగి శ్రీరామచంద్రమూర్తి, చిల్లిముంతల సుబ్రహ్మణ్యం, వల్లభు శ్రీనివాసరావు, ఇనుకొండ కాశీ, చినిమిల్లి బాబీ, ఆదిమూలం మోహన్, కె.నాగేశ్వరావు, రేలంగి బాబి, కాకుల సురేష్, జాన మురళి, వెలిగట్ల గణేష్ పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

వెలిసి నాగేశ్వరరావు, తండ్రి: సోమరాజు గారి ఒరిజినల్ డాక్యుమెంటు నెం.1401/1990 గల సేల్ డాక్యుమెంటు పోయినది. తూర్పు గోదావరి జిల్లా, పెరవలి మండలం, కానూరు నుండి 17-03-2023వ తేదీన బ్యాంకు పని నిమిత్తం తణుకుకు ఆటోలో ప్రయాణిస్తూ తణుకు బైపాస్ రోడ్డు సమీపానికి వచ్చేసరికి నా ఒరిజినల్ డాక్యుమెంటులు గల కవరు కనిపించలేదు. చుట్టుప్రక్కల ఎంత వెతికినా దొరకలేదు. ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు అందించగలరు.

పార్టీ వివరములు: డో.నెం. 5-71, కానూరు, పెరవలి మండలం, తూర్పు గోదావరి జిల్లా.

అరిగెల నాగేశ్వరరావు
అడ్వకేట్, తణుకు.
సెల్: 91103 82946

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో :: ఏలూరు జిల్లా
ఓ.ఎస్.నెం. 320/2021

బిట్వీన్:
ఇండియన్ బ్యాంక్, ఎన్.ఆర్.పేట, ఏలూరు ...ప్లయింటిఫ్
మరియు
ఏపూరి కోటేశ్వరరావు వగైరా ...డిఫెండెంట్స్

టు:
1) ఏపూరి కోటేశ్వరరావు, తండ్రి: నాగభూషణం, R/o. డో.నెం. 6-44-2, బాపులపాడు, కృష్ణా జిల్లా.
2) మాకా సుధాకరరావు, తండ్రి: భాస్కరరావు, R/o. డో.నెం. 6-93/1, పెదిపేట, సిద్ధాంతం, పెనుగొండ మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు గల దావాలో 1వ మరియు 2వ డిఫెండెంట్స్ హాజరు నిమిత్తం ది.25-04-2023వ తేదీన వాయిదా అయి ఉన్నది. కావున పైన ఉదహరించిన 1వ మరియు 2వ డిఫెండెంట్స్ కోర్టు వారి ఎదుట **ది.25-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు హాజరు కావలెను.** లేని ఎడల వారి పరోక్షంగా తీర్మానించబడును.

బి.గౌరీశంకర్
అడ్వకేట్, ఏలూరు.
సెల్: 74162 36226